సాక్షి
వికారాబాద్
బుధవారం ౹ 19 ౹ జూన్ ౹ 2024



వర్షాకాలం.. జరభద్రం

వర్షాలు పడుతుండటంతో రైతులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పొలాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. 8లో▸



శాస్త్రీయ సంరక్షణతో..

గొర్రెల పెంపకం లాభదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. 8లో▸



లెక్కలు తప్పుతున్నాయా!

వర్షపాత నమోదు కేంద్రాలు దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో వర్షపాత లెక్కల్లో కచ్చితత్వం తెలియడం లేదు. 8లో▸

న్యూస్‌రీల్

21నుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

అనంతగిరి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్స్‌లో (హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్) 4వ తరగతిలో ప్రవేశాల కోసం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు మండల స్థాయిలో ఎంఈఓ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపికలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి జూలై 3న జిల్లా స్థాయి (వికారాబాద్‌లో బ్లాక్ గ్రౌండ్)లో ఎంపికలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి జూలై 11, 12 తేదీల్లో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

23న మెగా జాబ్‌మేళా

టీజీ స్టెప్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 23న వికారాబాద్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గొలికార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, 60కి పైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో హాజరుకావాలని సూచించారు. నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధునిక సాగు లాభదాయకం

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



రైతులతో మాట్లాడుతున్న గోపాల్

పూడూరు: సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం పూడూరులో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న సాగు పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట మార్పిడితో చీడపీడల బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో పరిగి డివిజన్ అధికారి లక్ష్మికుమారి, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 30 పడకల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె రోగులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆస్పత్రుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొచ్చి పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు.

మైల్వార్ సెక్టార్‌లో ఆక్రమణకు గురైన అటవీ భూమి



అడవుల సంరక్షణకు పక్కా వ్యూహం

మానవ మనుగడకు ఆధారమైన అడవులు నేడు ప్రమాదపుటంచుల్లోకి వెళ్లాయి. అడవుల ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. దీనికి అడ్డుకట్ట వేయాలని భావించిన అటవీ శాఖ జిల్లా అధికారులు కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు.

ఆక్రమణలకు గురైన చోట మొక్కలు నాటేలా కార్యాచరణ

- ప్రజల భాగస్వామ్యంతో ముందుకు
- జిల్లాలో అటవీ విస్తీర్ణం 1,08,000 ఎకరాలు
- ఆక్రమణలో 25 శాతానికి పైగా..
- కర్ణాటక సరిహద్దులో భారీగా కబ్జాలు

వికారాబాద్: జిల్లాలో అడవులు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటి సంరక్షణకు అటవీ శాఖ సరి కొత్త వ్యూహంతో ముందుకెళ్తోంది. గతంలో ఆక్రమణలకు గురైతే కేసులు నమోదు చేసి వదిలేసే వారు.. ప్రస్తుతం ఆ స్థలాలను గుర్తించి మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందిస్తోంది. జిల్లాలో 1,08,000 ఎకరాల్లో అటవీ భూములు ఉన్నాయి. ఇందులో అటవీ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 25 శాతానికి పైగా (దాదాపు31 వేల ఎకరాలు) ఆక్రమణకు గురయ్యాయి. జిల్లాలో 94 ఫారెస్టు బ్లాకులు ఉండగా అందులో కొన్ని ఏరియాలు పూర్తిగా కబ్జాకోరల్లోకి వెళ్లిపోయాయి. మరికొన్ని చోట్ల 50 శాతం నుంచి 90శాతం వరకు ఆక్రమణలకు గురయ్యాయి.

జిల్లాలో 13శాతం అటవీ భూములు

జిల్లాలో 1,08,000 ఎకరాల విస్తీర్ణంలో అడవులు ఉండగా భౌగోళికంగా 13శాతం అటవీ భూములు ఉన్నాయి. ఇందులో 12.7శాతం గ్రీనరీ (20 వేల ఎకరాల్లో దట్టమైన అడవులు) ఉంది. చుట్టుపక్కల జిల్లాలతో పోలిస్తే ఇదే అత్యధిక శాతం. ఈ అటవీ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లుగా 94 బ్లాకులుగా విభజించారు. అందులో అనంతగిరి అడవి ముఖ్యమైనదిగా చెబుతారు. ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచేందుకు హరితహారం లాంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నా మరో పక్క కబ్జాల కారణంగా రోజు రోజుకూ అడవులు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. దీంతో వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలుగుతోంది. పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తే తప్ప అడవుల సంరక్షణ సాధ్యం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు.

గూగుల్ మ్యాప్‌ల ద్వారా..

గతంలో అటవీ భూములు ఆక్రమణలకు గురైతే కేసులు నమోదు చేసే వారు. ప్రస్తుతం కబ్జాకు గురైన ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నారు. మళ్లీ ఎవరైనా మొక్కలు నరికితే కేసుల నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. హద్దులు దాటకుండా కందకాలు తవ్వుతున్నారు. తాజాగా చెట్లు నరికిన ప్రదేశాలను గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తిస్తున్నారు. ఇటీవల ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి బాణాపూర్, దోర్నాల తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

చెట్లు నరికితే చర్యలు



అటవీ భూములను ఆక్రమించినా.. చెట్లను నరికినా కఠినంగా వ్యవహరిస్తాం. అడవుల సంరక్షణ, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సరిహద్దు అటవీ భూముల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. అందరి సహకారంతోనే అడవుల సంరక్షణ సాధ్యం.

– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌ఓ, వికారాబాద్

కర్ణాటక రైతుల ఆక్రమణ

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా.. మన జిల్లా సరిహద్దులో ఉంటుంది. ఈ రెండు ప్రాంతాల్లో అటవీ భూములు ఉన్నాయి. బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామ శివారులో సుమారు 300 ఎకరాల అటవీ భూములను కర్ణాటక రైతులు ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల ఈ విషయమై రెండు సరిహద్దు రాష్ట్రాల రైతులు గొడవ కూడా పడ్డారు. వికారాబాద్ అటవీ అధికారులు కర్ణాటక రైతులు సాగు చేస్తున్న భూములు తెలంగాణకు చెందినవని తేల్చారు. ప్రస్తుతం ఆ భూముల్లో కూడా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం గుల్బర్గా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో మన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ముందుకు పంచాయితీ వచ్చింది. ఆ కలెక్టర్ మన కలెక్టర్‌తో మాట్లాడినట్టు సమాచారం. రెండు జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకుని సమగ్రమైన సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.



చేవెళ్ల సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

'నులి'మేద్దాం.. నివారిద్దాం

- నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు
- 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి పంపిణీ
- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు

షాబాద్: పిల్లల్లో నులిపురుగుల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 20, 27తేదీల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1 – 2 సంవత్సరాల వయస్సు వారికి సగం మాత్రను, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి పూర్తి ట్యాబ్లెట్ ఇవ్వనున్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల చేత మాత్రలు మింగించేందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ పూర్తి చేశారు.

ఆరోగ్యకరమైన సమాజం నిర్మించుకుందాం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

చేవెళ్ల: నులిపురుగులు లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని చేవెళ్ల డిప్యూటీ డీహెంచ్‌ఓ దామోదర్ అన్నారు. మండలకేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20న నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 నెలల నుంచి 19 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. 20న ఈ కార్యక్రమం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అనివార్య కారణాలతో ఎవరైనా మిగిలిపోతే 27న మరోసారి మాత్రలు వేయించనున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఉండే ఓ టీచర్‌ను నోడల్ అధికారిగా కేటాయించటం జరుగుతుందని, వారే అందరికీ మాత్రలు వేశారా లేదా అన్నది చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మాత్రలతో ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు నోటు పుస్తకాలు అందజేస్తున్న ట్రెసా ప్రతినిధులు

అనంతగిరి: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతీక్‌జైన్‌ను మంగళవారం జిల్లా అధికారులు, ఆయా శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, అమరేంద్ర కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు దీపక్, డివిజన్ అధ్యక్షులు రమేష్, వీరేష్‌బాబు, రెవెన్యూ యూనియన్ ప్రతినిధులు విజయ్‌కుమార్, పురుషోత్తం, గణేశ్, మురళీధర్, సురేష్, విజయ్, శ్రీలత, రాజేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్, బాల్‌రాజు, నరేందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

బీసీ కుల గణన చేపట్టాలి

బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్

అనంతగిరి: బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ కుల గణన చేపడతామన్న కాంగ్రెస్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంగమేశ్వర్, లక్ష్మణ్ యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

ఏటా ప్రహసనంగా ఆర్టీఏ తనిఖీలు

బడి బస్సుల తనిఖీలు ప్రహసనంగా మారాయి. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో సామర్థ్యం లేని బస్సులను తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినా.. ఆ తర్వాత అవి మళ్లీ రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. మరోవైపు ఆర్టీఏ అధికారులు సైతం బస్సుల సామర్థ్యాన్ని నిర్ధారించడంలో కచ్చితమైన ప్రమాణాలను పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని విద్యాసంస్థలు కాలం చెల్లిన డొక్కు బస్సులను నడిపినా పట్టించుకోకుండా కొందరు ఎంవీఐలు ఉత్తుత్తి తనిఖీలు చేసి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

- గ్రేటర్ పరిధిలో 14,624 స్కూల్ బస్సులు
- రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 11,922
- వీటిలో 3,500 బస్సులు కండిషన్ లేనివే..
- నిబంధనలు పట్టించుకోని పాఠశాలలు
- విద్యా సంవత్సరం ఆరంభంలోనే హడావుడి
- ఆ తర్వాత గాలికొదిలేస్తున్న రవాణా శాఖ



గ్రేటర్ పరిధిలో సుమారు 14,624 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోనే సుమారు 11,922 బస్సులు పిల్లలకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. వీటిలో సుమారు 3,500కు పైగా బస్సులు సామర్థ్యం లేనివి ఉన్నట్లు అంచనా. మరోవైపు సామర్థ్యం ఉన్నట్లు ధ్రువీకరించిన వాటిలోనూ ఏ మేరకు ఫిట్‌నెస్ ఉందనేది సందేహమే. ఏటా వారం రోజుల పాటు ఆర్టీఏ అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరామామూలుగా మారింది. దీంతో స్కూల్ బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కొన్ని విద్యాసంస్థలు తక్కువ జీతాలతో లభించే డ్రైవింగ్‌లో పెద్దగా అనుభవం లేనివారిని నియమిస్తున్నాయి. బస్సుల సామర్థ్యాన్నీ గాలికొదిలేస్తున్నాయి.

ఎందుకీ నిర్లక్ష్యం?

స్కూల్ బస్సుల కారణంగా జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలను రూపొందించింది. నిబంధనలు, మార్గదర్శకాలను పేర్కొంది. ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. నిరంతర నిఘా విధానం లేకపోవడం, డ్రైవర్లపై ఎలాంటి నియంత్రణ, తనిఖీ లేకపోవడంతో బడి బస్సుల్లో పిల్లల భద్రత గాలిలో దీపంలా మారుతోంది.

స్కూల్ బస్సు ఇలా ఉండాలి..

- బస్సు పసుపు రంగులో ఉండాలి. రంగు పాలిపోయినట్లుగా కాకుండా స్పష్టంగా కనిపించాలి. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు అమర్చాలి. బస్సు లోపలి భాగంలో పెద్ద పారదర్శకమైన అద్దం ఏర్పాటు చేయాలి. దీనివల్ల లోపల ఉన్న పిల్లలు కూడా డ్రైవర్‌కు కనిపిస్తారు.
- బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), పొడి అందుబాటులో ఉండాలి. అత్యవసర ద్వారం ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలి.
- సదరు పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా బస్సుకు ఎడమవైపున ముందుభాగంలో స్పష్టంగా రాయాలి.
- సీట్ల కిందిభాగంలో బ్యాగులు పెట్టుకొనేలా అరలు ఏర్పాటు చేయాలి. పిల్లలు పట్టుకొనేందుకు వీలుగా అక్కడక్కడా లోహపు స్తంభాలను బస్సులో అమర్చాలి.
- వాహనానికి నలువైపులా పైభాగం మూలాల్లో (రూఫ్‌పై కాదు) బయటివైపు యాంబర్ (గాఢ పసుపు పచ్చని) రంగున్న ఫ్లాపింగ్ లైట్లను ఏర్పాటు చేయాలి. పిల్లలు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు ఈ లైట్లు వెలుగుతూ ఉండాలి.
- సదరు వాహనం స్కూల్ బస్సు అని తెలిసేలా ముందుభాగంలో పెద్ద బోర్డుపై 250 ఎంఎంకు తగ్గని విధంగా ఇద్దరు విద్యార్థులు (ఒక అమ్మాయి, ఒక అబ్బాయి) నల్లరంగులో చిత్రించి ఉండాలి. ఆ చిత్రం కింద 'స్కూల్ బస్సు' లేదా 'కళాశాల బస్సు' అని నల్ల రంగులో కనీసం 100 ఎంఎం సైజు అక్షరాల్లో రాయాలి. అక్షరాల గాఢత సైజు కనీసం 11ఎంఎం ఉండాలి.
- బస్సు తలుపులు సురక్షితమైన లాకింగ్ సిస్టమ్‌తో ఉండాలి. సైడ్ విండోలకు అడ్డంగా 3 లోహపు కడ్డీలను ఏర్పాటు చేయాలి. సీటింగ్ సామర్థ్యం కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు.
- ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు 325 ఎంఎం ఎత్తుకు మించకుండా ఉండాలి. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చాలి.
- లోపలికి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకొనేందుకు వీలుగా ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్ ఉండాలి.
- బస్సులో ప్రయాణించే విద్యార్థుల పేర్లు, తరగతులు, చిరునామాలు, ఎక్కాల్సిన, దిగాల్సిన వివరాలు బస్సులో ఉండాలి.

డ్రైవర్ల అర్హతలిలా..

- డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి.
- యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్లకు ప్రతి 3 నెలలకోసారి రక్తపోటు, షుగరు, కంటి చూపు వంటి ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్,తదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. ప్రతి బస్సులో ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలి.
- డ్రైవర్‌కు బస్సు డ్రైవింగ్‌లో కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి.

అమలుకు నోచుకోని నిబంధనలు

- నిబంధనల్లో చాలా వరకు అమలుకు నోచుకోవడం లేదు.
- స్కూల్ బస్సుల భద్రతను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. ఇప్పటి వరకు అమల్లోకి రాలేదు.
- బస్సు లోపలివైపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవర్ నైపుణ్యాన్ని అంచనా వేయడంతో పిల్లలను జాగ్రత్తగా బస్సు ఎక్కించేందుకు, తిరిగి ఇళ్ల వద్ద దించేందుకు సిబ్బంది చూపే శ్రద్ధ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

జనావాసాల్లోకి కొండచిలువ



కొండ చిలువను పట్టుకుంటున్న స్నేక్ సొసైటీ సభ్యుడు

మణికొండ: పన్నెండు అడుగుల పొడవు కొండ చిలువ జనావాసాల్లోకి వచ్చి స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ రోడ్డు నంబర్– 4లోని ఖాళీ స్థలంలో కొండచిలువ కనిపించింది. వెంటనే స్థానికులు స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పట్టుకున్నారు. పాములు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వాటిని జూపార్కులో అప్పగిస్తామని స్నేక్ సొసైటీ సభ్యులు సూచించారు.

కవి విల్సన్ సుధాకర్‌కు ప్రతిష్టాత్మక రోమ్ పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: నాశ్చిరా అసోసియేషన్, బార్ట్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక 'డొన్నె డీఅమోర్' (ఉమెన్ ఆఫ్ లవ్) అంతర్జాతీయ అవార్డుకు తెలుగు కవి తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ ఎంపికయ్యారు. ఈ నెల 27న రోమ్ (ఇటలీ) వేదికగా అవార్డును స్వీకరించడానికి బార్ట్ ఇంటర్నేషనల్ గ్రూప్ నుంచి ఆహ్వానం అందిందని విల్సన్ సుధాకర్ తెలిపారు. మహిళా ప్రపంచానికి ప్రేరణగా రాసే సాహిత్యానికి గౌరవంగా ఈ అవార్డును అందిస్తారు. స్త్రీలపై సుధాకర్ రాసిన తెలుగు కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించగా.. ఆ కవిత్వం ఔన్నత్యాన్ని తెలుసుకొని దానిని ఇటాలియన్‌లోకి అనువదించి ఈ అవార్డుకు ఎంపిక చేశారని సుధాకర్ వివరించారు. నగరానికి చెందిన సుధాకర్ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా జపాన్, దక్షిణాఫ్రికా, దుబాయ్‌లలో విధులు నిర్వహించారు. పేదల పక్షపాతిగా, స్త్రీలు, బాలకార్మికులు, దళితులకు సంబంధించిన పలు అంశాలపై విల్సన్ సుధాకర్ రాసిన రచనలు ఆదరణ పొందాయి. ఆయన రాసిన పలు కవితలు ఆంగ్లం, ఇటాలియన్ భాషల్లోకి అనువాదమయ్యాయి.

క్లుప్తంగా

'ఉపాధి హామీ'పై ఆడిట్



పూర్తి చేసిన పనులను పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

దుద్యాల్: మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులకు సంబంధించిన ఆడిట్(తనిఖీలు) మంగళవారం ప్రారంభమయ్యాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.12.19లక్షలకు సంబంధించిన పనులకు బుధవారం వరకు ఆడిట్ కొనసాగుతుందని ఆడిట్ అధికారులు డీఆర్పీ లక్ష్మణ్ నాయక్ మరియు ఎస్ఆర్పీలు గంగ రాములు, స్వామి చెప్పారు. అవకతవలకను గుర్తించేందుకు పనులను పరిశీలిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్క కూలీ వివరాలు సరిచూస్తున్నామన్నారు. ఏ రైతు పొలంలో పనులు చేసినారో అక్కడికే వెళ్లి పనులను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజప్ప ఉన్నారు.

ఎల్లమ్మ జాతరలో భక్తుల రద్దీ



ఆలయంలో భక్తుల ప్రదక్షిణలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. నెల రోజులుగా సాగుతున్న ఉత్సవాల్లో ప్రతీ మంగళ, శుక్ర వారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆఖరి మంగళవారం అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ఈఓ శేఖర్‌గౌడ్, నాయకులు సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సాయిలు, గోపాల్, ప్రవీణ్‌రెడ్డి, బసిరెడ్డి, పూజారి శ్రీనివాస్, సిబ్బంది రవి ఉన్నారు.

నృత్య ప్రదర్శనలో రామాయణ ఘట్టాలు

షాద్‌నగర్‌రూరల్: ఒడిశా రాష్ట్రంలోని రౌర్కెల పట్టణంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ డాన్స్ ఫెస్టివల్‌కు నటరాజ కళానిలయం విద్యార్థిని కీర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నృత్య శిక్షకురాలు సురభి శారద బృందం సభ్యులు రామాయణంలోని వివిధ ఘట్టాలను ప్రదర్శించారు. కీర్తి జనక మహారాజు పాత్రలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మానసాటి ప్రదీప్‌కుమార్ ఆమెని అభినందించారు.

వర్షాకాలం.. జరభద్రం

నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ముప్పు

- జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



దోర్నాల్‌పల్లిలో విద్యుత్ లైన్లను బాగు చేస్తున్న సిబ్బంది

దోమ: వర్షాలతో రైతులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇళ్లు, పంటపొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో విద్యుత్‌తో బోరుబావులు, వాగులు, పొలాల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంట సాగు చేస్తుంటారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలకే ప్రమాదం. రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

పరిహారం అందాలంటే..

విద్యుత్ సంస్థలు కేవలం మూడు ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తోంది. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందిస్తుంది. గాయాలకు ఎలాంటి పరిహారం ఉండదని విద్యుత్ అధికారులు వెల్లడిస్తున్నారు. మనుషులు మృతి చెందితే రూ.5లక్షలు, ఆవులు, బర్రెలు మృతి చెందితే రూ.45 వేలు, మేకలు, గొర్రెలు మృతి చెందితే రూ.5వేల చొప్పున ప్పునా నష్టపరిహారం చెల్లిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగిన స్థలంలోని వాటి చిత్రంతో పాటు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం రిపోర్టును జతచేసి విద్యుత్ అధికారులకు సమర్పించాలి.

ఇలా జరిగితేనే నష్టపరిహారం

- అకస్మాత్తుగా తెగి పడిన విద్యుత్ తీగలు తగిలి మరణం.
- తక్కువ ఎత్తులోని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా మృతి.
- తక్కువ ఎత్తులోని విద్యుత్ తీగలు తగిలి పోయిన ప్రాణానికి.

జాగ్రత్తలు

- మోటర్లను ప్రత్యేకంగా గద్దెలపై ఏర్పాటు చేసుకోవాలి.
- స్టార్టర్ బోర్డు తడవకుండా చూసుకోవాలి.
- మోటర్ పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతు చేయించాలి.
- సర్వీస్ వైర్లు, మోటర్‌కు వాడే తీగలు నాణ్యమైనవే వాడాలి.
- వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేయాలి.
- సబ్ మెర్సిబుల్ మోటార్లలో విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ కొంచెం వైరు తెగిన మోటర్ నుండి పైన ఉండే వస్తువుల వరకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

అవగాహన కల్పించాలి



విద్యుత్ వినియోగంపై అధికారులు రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. విద్యుత్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు స్పష్టంగా, అర్థవంతంగా విద్యుత్ వినియోగంపై వివరిస్తే ఉపయోగం ఉంటుంది.

– నజీరుద్దీన్, రైతు, గొడుగోనిపల్లి

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. లైన్‌మెన్‌లను అందుబాటులో ఉంచుతూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. లూప్‌లైన్‌లు వేలాడుతున్నా.. కింద పడిపోయినా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

– కిషోర్, విద్యుత్ ఏఈ, దోమ

సజావుగా యూజీసీ నెట్



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్‌లు చూసుకుంటున్న అభ్యర్థులు

కద్తాల్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిఅసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పోస్ట్ కోసం దరఖాస్తు చేయడానికి అర్హతను నిర్ణయించే యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్) నెట్ పరీక్షను మంగళవారం నిర్వహించారు. దీనికి కడ్తాల్ మండల కేంద్రంలోని ఫార్చ్యున్ బటర్‌ఫ్లై సీనియర్ సెకండరీ స్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఉదయం సెషన్‌కు 276 మంది అభ్యర్థులకు గాను 182 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 600 మందికి గాను 478 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్లు సునీల్, సుజాత, డిప్యూటీ అబ్జర్వర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం నిర్వహణలో సూపరింటెండెంట్ రంగారావు, డిప్యూటీ సెంటర్ సూపరింటెండెంట్ భుజంగరావు, పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన పట్టణ శివారులోని సీఎస్‌కే వెంచర్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ తూక్యానాయక్ కథనం ప్రకారం.. సీఎస్‌కే వెంచర్ సమీపంలోగల నిర్మానుష్య ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తి(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ తూక్యానాయక్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను స్థానిక రైతులను అడిగినా తెలియరాలేదు. వెంటనే మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మట్టి తవ్వకాలు నిలిపివేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శంషాబాద్: మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి చెందిన నల్లచెరువులో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వందేళ్లుగా చెరువుకు సంబంధించిన హక్కులన్నీ గ్రామస్తులకు ఉన్నాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవినాయక్, కె. వెంకటేశ్, శంకరయ్య, చిన్న, లాలుసింగ్, బాలూనాయక్ తదితరులున్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్ మంగళవారం కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి స్పెషల్ డ్రైవ్ సందర్భంగా జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు ఈ డ్రైవ్‌ను కొనసాగించాలని ఉప కమిషనర్ రవి కుమార్ అధికారులకు ఆదేశించారు. అధికారులు కార్యాలయంలోనే అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని సూచించారు. ఐదు జేసీబీల ద్వారా వ్యర్థాలను టిప్పర్లలో డంప్‌యార్డుకు తరలిస్తున్నారు.

పన్ను చెల్లించు.. అభివృద్ధికి సహకరించు

సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్నును చెల్లించి జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్ రవి కుమార్ కోరారు. ఈ నెల 30 వరకు ఇంటి పన్నులు చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. మంగళవారం ఆయన బిల్లు కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి బిల్ కలెక్టర్‌కు టార్గెట్ విధించామని, దానిని తప్పనిసరిగా రీచ్ అవ్వాలని సూచించారు. జూన్ నెలకు రూ.4 కోట్లు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయానికి రూ.64 కోట్ల టార్గెట్ విధించారని, ప్రస్తుతం రూ.23 కోట్ల ఆస్తిపన్ను మాత్రమే వసూలైందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సమావేశంలో బిల్లు కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తైబజార్ వేలం

మణికొండ: వారాంతం సంతలో తైబజార్ వసూలు చేసుకునేందుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో 16 మంది పాల్గొన్నట్లు మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ తెలిపారు. మహమ్మద్ దస్తగిరి రూ. 31.5 లక్షలకు వేలంను దక్కించుకున్నారని చెప్పారు. వేలం దక్కించుకున్న వారు రోజు వారిగా జరిగే వారంతం సంతలలో మాత్రమే తైబజార్ వసూలు చేయాలని సూచించారు. వీరికి 2025 మార్చి 31వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ లెక్కలు తప్పుతున్నాయా?

- నామమాత్రంగా దర్శనమిస్తున్న నమోదు కేంద్రాలు
- వర్షపాత వివరాలను గాలికొదిలేసిన అధికారులు
- కింది స్థాయి సిబ్బంది చెప్పిన వివరాలే నమోదు



సబ్‌స్టేషన్ ఆవరణలోని రెయిన్‌గేజ్



దౌల్తాబాద్‌లో తహసీల్దారు కార్యాలయంపై ఏర్పాటు చేసిన వర్షపాతం తెలిపే తొట్టి

దౌల్తాబాద్: వర్షపాత నమోదు కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వానాకాలంలో ఆయా మండలాల్లో వర్షపాతం ఎంత నమోదైందో కచ్చితమైన సమాచారం లేకుండా పోతోంది. ఉన్నతాధికారులకు కాకిలెక్కలు చెప్పడంతో వర్షపాతంపై రైతులకు, ప్రజలకు అసలైన సమాచారం ఉండడం లేదు. రైతులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో, తహసీల్దారు కార్యాలయం పైన వర్షపాత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల స్థాయి అధికారులు ఏ రోజు ఎంత వర్షపాతం నమోదైంది. ఎంత గాలి వీచింది అనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలి. అలా కాకుండా నమోదు కేంద్రాలను గాలికొదిలేయడంతో కింది స్థాయి సిబ్బంది ఎంత చెబితే అంత ఆరోజుకు నమోదు చేయడం పరిపాటిగా మారింది. దీంతో వాతావరణ శాఖ ద్వారా రైతులకు ప్రజలకు కచ్చితమైన సమాచారం అందడం లేదు. ముందస్తు సమాచారం ఉంటే రైతులు, విత్తనాలు వేసుకోవడానికి విత్తనాలు సేకరించడం, కోత కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం తదితర పనులు చేపడుతారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి ఆయా వర్షపాత నమోదు కేంద్రాలను ఉపయోగంలోకి తెచ్చి కచ్చితమైన సమాచారం రైతులకు మండల ప్రజలకు అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తేలికపాటి భూముల్లోనూ అధిక దిగుబడులు

తాండూరు ఏడీఏ రుద్రమూర్తి

యాలాల: పత్తి సాగులో తగిన పద్ధతులు పాటిస్తే తేలికపాటి భూముల్లోనూ అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. మంగళవారం ఆయన యాలాల రైతు వేదికలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త లక్ష్మణ్‌తో కలిసి అధిక సాంద్రత పత్తి సాగుపైన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేలిక పాటి భూముల్లో రైతులు అధిక దిగుబడి అవకాశానికి పలు సూచనలు పాటించాలన్నారు. రాశి కంపెనీ స్విస్ట్ రకం పత్తి విత్తనాలు ఎకరానికి ఐదు ప్యాకెట్లు సరిపోతాయన్నారు. పత్తి విత్తనాలు నాటే సమయంలో మొక్కకు మొక్కకు 15 సెంటీ మీటర్ల దూరం పాటిస్తూ విత్తుకోవాలన్నారు. ఇలా నాటితే ఎకరానికి సుమారు 29 వేల మొక్కలు నాటేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు యాదగిరి, రజిత పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులివ్వండి



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న కేశవులు, రమేశ్

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవిని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు అభ్యర్థించారు. నగరంలోని ఎంపీ నివాసంలో మంగళవారం ఆయన్ని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

మూడు కాడెడ్ల అపహరణ

రూ.2.50లక్షలు నష్టపోయానని రైతు ఆవేదన

మర్పల్లి: షెడ్‌లో కట్టేసిన మూడు కాడెడ్లను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నాగడనల్లి రహీముద్దీన్ ఎద్దుల సాయంతో తనకున్న ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. ఇంటి వద్ద స్థలం లేకపోవడంతో పొలం వద్దే షెడ్ ఏర్పాటు చేశాడు. ఆదివారం రోజు రాత్రి పది గంటల సమయంలో భోజనం చేసి షెడ్ వద్దకు వచ్చి ఎడ్లకు మేత వేసి పడుకున్నాడు. అప్పటికే మాటేసిన దుండగులు ఎడ్ల మెడలో తాళ్లను కోసేసి తోల్కుని పోయారని మంగళవారం విలేకరులకు వివరించారు. అదేరాత్రి మర్పల్లి పోలీసులకు సమాచారమివ్వగా రాత్రి 2గంటల సమయంలో షెడ్ వద్దకు వచ్చి ఫొటోలు తీసుకున్నారని చెప్పారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలు పరిశీలించి ఎడ్లను జాడ తెలుసుకోవాలని కోరుతున్నాడు. పోలీసుల గస్తీ లేక రూ.2.50లక్షలు నష్టపోయానని త్వరగా దుండగులను పట్టుకోవాలని రైతు కోరాడు.



వేణుగోపాల స్వామి ఆలయంలో చదును చేసిన స్థలం

ఆలయ స్థలం అన్యాక్రాంతం

గుట్టుచప్పుడు కాకుండా చదును

బడంగ్‌పేట్: బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన సంతాన వేణుగోపాలస్వామి ఆలయ స్థలం అన్యాక్రాంతం అవుతుంది. ఆలయ రాజగోపురానికి దక్షిణ దిక్కుగా ఉన్న దాదాపు 200 గజాల స్థలాన్ని కొందరు చదును చేశారు. గ్రామస్తులకు తెలియకుండా చదును చేయడం వివాదాస్పదంగా మారింది. ఆలయ కమిటీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఈ వ్యవహారం నడిపిస్తున్నారని స్థానికంగా ఆరోపిస్తున్నారు. ఆలయంలో ఏ పనులు చేపట్టాలన్నా గ్రామ పెద్దలతో పాటు ఎండోమెంట్ అధికారుల అనుమతి తీసుకోవాలి. కానీ కమిటీ నిర్వాహకులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా యథేచ్ఛగా ఆలయ స్థలాన్ని చదును చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ ఆలయానికి వందల ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ప్రస్తుతం అవి వేరే వ్యక్తుల చేతుల్లో మగ్గుతున్నాయి.

సమాచారం లేదు



వేణుగోపాలస్వామి ఆలయానికి గ్రామస్తులందరూ కలిసి అభివృద్ధికి సహకరిస్తున్నారు. అలాంటిది గుట్టుచప్పుడు కాకుండా స్థానిక కార్పొరేటర్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా చదును చేస్తారు? అందులో ఏం చేస్తున్నారు? ఆలయ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలి.

– ఎద్ర మహేశ్వరి, కార్పొరేటర్

శాస్త్రీయ సంరక్షణతో లాభాలు

- గొర్రెల పెంపకంలో పిల్లల ఆరోగ్యం ముఖ్యం
- రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి





షాబాద్: గొర్రెల పెంపకం లాభాదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్య పోషణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గొర్రె పిల్లల పెంపకంలో అవగాహన లేమితో చాలా మంది కాపరులు నష్టపోతున్నారు. వీటిని అధిగమించడానికి రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

పుట్టిన వెంటనే..

గొర్రె పిల్ల పుట్టిన వెంటనే ముక్కు, నోరు మీద ఉండే పొర తొలగించి పొడి గుడ్డతో తుడవాలి. బొడ్డు దానంతట అదే విడిపోకపోతే రెండు అంగుళాలు కత్తిరించి అయోడిన్‌తో శుభ్ర పరచాలి. పుట్టిన గంటసేపటికి ముర్రుపాలు తాగించాలి. ముర్రుపాలలో విటమిన్ ఏ, డీ, ఈ ఉండడంతో వ్యాధి నిరోధక శక్తి నిచ్చే యాంటీబాడీలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. పిల్లలను విడిగా ఉంచి వెలుతురు, గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లో కట్టి వేయాలి. పిల్లలను చలి నుంచి సంరక్షించాలి.

పాలు మరిచే వరకు..

పాలు మరిచే వరకు(దాదాపు మూడు నెలలు) పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలను తల్లితో పాటు మందకు పంపకుండా కొట్టాంలో ఉంచి పెంచాలి. తల్లితో పాటు పంపితే శక్తి వృథా అయి పెరుగుదల తగ్గుతుంది. పిల్లలను గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలి. వరిగడ్డి పక్కలో వేస్తే వెచ్చగా ఉండి పిల్లలు మట్టి తినకుండా అరికట్టవచ్చు.

తల్లి పాలకు అదనంగా..

గొర్రె పిల్లల్లో పెరుగుదల మొదటి మూడు నెలల్లో ఎక్కువ ఉంటుంది. ఇలా అధిక పెరుగుదలున్నా గొర్రె పిల్లలే ముందు ఆరోగ్యంగా ఉండి ఎక్కువ బరువుతో ఉంటాయి. పాలు మరిచే వయసు వరకు తల్లి పాలకు అదనంగా పోషణనివ్వాలి. చిన్న గొర్రెలను నిదానంగా ఆకు తింటూ అవి జీర్ణించుకోవడానికి అలవాటు పడతాయి.

సమయానికి టీకాలు

తల్లి గొర్రెలను మేతకు పంపిన తర్వాత వేపాకు లేదా దాణా వేసి పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా అన్ని చూడాలి. మూడు నెలల వయసు దాటిన తర్వాత మొదటిసారి నట్టల నివారణ మందు ఇవ్వాలి. ఇది ఊపిరితిత్తుల్లోకి పోకుండా జాగ్రత్తగా తాపించాలి. దీని తర్వాత 10–15 రోజుల వ్యవధిలో చిటుకు వ్యాధి నివారణ టీకా ఇవ్వాలి. మరో 15 రోజులకు రెండో డోసు ఇవ్వాల్సి ఉంటుంది.